క్లుప్తంగా

నేటినుంచి దుర్గాదేవి జాతర


దుర్గాదేవి అమ్మవారు

పొందూరు: తండ్యాం పంచాయతీ శ్రీరామ్‌నగర్ కాలనీలో కొలువుదీరిన దుర్గాదేవి 29వ జాతర మహోత్సవాలు ఆదివారం నుంచి మూడు రోజులు జరగనున్నాయి. ఈ విషయాన్ని రుత్వికులు గన్నవరపు రాంబాబు శనివారం తెలిపారు. కాగా అమ్మవారికి శనివారం ప్రత్యేక పూజలు అర్చకులు గన్నవరపు రాంబాబు, నాగేశ్వరశర్మల ఆధ్వర్యంలో జరిగాయి.

వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన


కార్మికులకు ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

నరసన్నపేట: మహిళలు పరిసరాలతోపాటు వ్యక్తిగత పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని నోవర్టీస్ ఆరోగ్య పరివార్ సంస్థకు చెందిన హెల్త్ ఎడ్యుకేటర్ ఎం.రత్నకుమారి అన్నారు. తామారాపల్లిలో భవన నిర్మాణ కార్మికులకు ఆరోగ్యంపై శనివారం అవగాహన కల్పించారు. ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. మరుగుదొడ్ల వినియోగం తప్పనిసరన్నారు. ఆరుబయట మల మూత్ర విసర్జనతో వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందన్నారు.

ఉపాధ్యాయులకు బదిలీలు


బదిలీ ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న మణికుమార్

పాతపట్నం: మండలంలోని వివిధ పాఠశాలల్లో పనిచేసిన పది మంది ఉపాధ్యాయులకు డీఈవో జి.పగడాలమ్మ ఆదేశాల మేరకు బదిలీలు చేపట్టామని ఎంఈవో సీహెచ్ మణికుమార్ తెలిపారు. స్థానిక ఎంఆర్‌సీ కార్యాలయంలో శనివారం బదిలీల ప్రక్రియ చేపట్టామన్నారు. అలాగే చాకిపల్లి గ్రామానికి డీఈవో ఆదేశాల మేరకు నూతనంగా మంజూరైన పాఠశాలకు ఒక ఉపాధ్యాయుడుని కేటాయించామన్నారు. కార్యక్రమంలో సీఆర్‌పీలు పాల్గొన్నారు.

బ్యానర్ల తొలగింపు


కొత్తూరులో విద్యుత్ స్తంభానికి ఉన్న బ్యానర్లను తొలగిస్తున్న వీఆర్‌ఏ అనీల్

కొత్తూరు: ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో వివిధ పార్టీలకు చెందిన బ్యానర్లను తొలగించే ప్రక్రియను అధికారులు శనివారం చేపట్టారు. స్థానిక తహసీల్దార్ పి.బాల ఆదేశాల మేరకు మండల కేంద్రం కొత్తూరుతో పాటు గ్రామాల్లోని పలు రాజకీయ పార్టీలు ప్రభుత్వ స్థలాల్లో ఏర్పాటు చేసిన బ్యానర్లు, కటౌట్లతో పాటు పలు రకాల ప్రదర్శన ఫొటోలను ప్రభుత్వ సిబ్బంది తొలగించారు.

ఎమ్మెల్సీ ఓటుకు దరఖాస్తు చేసుకోండి

నరసన్నపేట: రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి డిగ్రీ పూర్తి చేసిన వారు ఓటు హక్కు కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చునని నరసన్నపేట తహసీల్దార్ ఎ.సింహాచలం అన్నారు. ఈ నెల 15వ తేదీ వరకూ దరఖాస్తు చేసుకోవడానికి గడవు ఉందన్నారు. 2019 నవంబర్ నాటికి డిగ్రీ పూర్తయిన ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకోవడానికి అర్హులన్నారు.

రేషన్ అందలేదని ఫిర్యాదు


వైఎస్సార్‌సీపీ నాయకులకు ఫిర్యాదు చేస్తున్న కార్డుదారులు

సరుబుజ్జిలి: రేషన్ బియ్యం అందలేదని మూలసవలాపురం గ్రామ రేషన్‌డిపో పరిధిలోని తురకపేట కాలనీ, వ్యాసులుపేట గ్రామాలకు చెందిన సుమారు 150 కార్డుదారులు అధికారులకు శనివారం ఫిర్యాదు చేశారు. సుమారు 1150 కిలోల బియ్యం అందలేదని లబ్ధిదారులు తమ దృష్టికి తెచ్చారని వైఎస్సార్‌సీపీ నాయకులు సిరిపల్లి శ్రీనివాసరావు, బెండి శ్యామలరావు తెలిపారు. దీంతో లబ్ధిదారులతో కలిసి వెళ్లి తహసీల్దార్ రమేష్‌కుమార్ ఫిర్యాదు చేశామన్నారు. జిల్లా కలెక్టర్ స్పందనలో కూడా దీనిపై ఫిర్యాదు చేస్తామన్నారు. ఈ విషయాన్ని సివిల్‌సప్లయ్ డీటీ రామకృష్ణ వద్ద ప్రస్తావించగా పరిశీలించి కార్డుదారులకు న్యాయం చేస్తామన్నారు.

● మొక్కల పంపిణీ



తురకపేట గ్రామంలోని మారుతీ వనం ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో పెంచేందుకు అవసరమైన రుద్రాక్ష మొక్కలను లక్ష్మీనర్సుపేట గ్రామానికి చెందిన జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ఎం.కె.మిశ్రో శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేవాలయ ప్రాంగణంలో రుద్రాక్ష మొక్కలు పెంచటం ఎంతో అవసరమన్నారు. మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని గ్రామస్తులను కోరారు.

-ఎల్.ఎన్.పేట

● మంచు గుబులు



కొద్ది రోజులుగా కురుస్తున్న పొగమంచుతో జీడిమామిడి రైతులు ఆందోళన చెందుతున్నారు. శనివారం తెల్లవారుజాము నుంచి పది గంటల వరకు భారీగా మంచుపడింది. దీంతో పూతరాలిపోయే ప్రమాదం ఉందని జీడిమామిడి రైతులు వాపోయారు. కాగా మంచుతో వాహన చోదకులు రాకపోకలకు ఇబ్బంది పడ్డారు.

-మెళియాపుట్టి

● నివాళులు..



ఏకాత్మ మానవాద సిద్ధాంతకర్త పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ వర్ధంతి కార్యక్రమాన్ని లక్ష్మీనర్సుపేట గ్రామంలోని జగన్నాథస్వామి ఆలయ ప్రాంగణంలో శనివారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి బీజేపీ నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు వాన వెంకటరమణ, నాయకులు గండివలస సోమేశ్వరరావు, వాన సోమేశ్వరరావు పాల్గొన్నారు.

-ఎల్.ఎన్.పేట

గ్రామ కంఠం భూములు రక్షించాలి

● పాతపట్నం మండల సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో జయంత్‌ప్రసాద్

పాతపట్నం: మండల వ్యాప్తంగా ఉన్న గ్రామ కంఠం భూములు పరిరక్షించాలని ఎంపీడీవో జయంత్ ప్రసాద్ కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ దొర సావిత్రమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాతపట్నం మండలంలోని 34 గ్రామ పంచాయతీల పరిధిలో ఉన్న గ్రామ కంఠం భూములను ప్రజా ప్రతినిధులు రక్షించాలన్నారు. మండలంలోని 49 గ్రామ రెవెన్యూ పరిధిలోని ప్రభుత్వం భూములపై సర్వే చేపడుతున్నట్టు పేర్కొన్నారు. ఎంఈవో సీహెచ్ మణికుమార్ మాట్లాడుతూ.. చాకిపల్లి గ్రామానికి ప్రభుత్వం నూతన పాఠశాలను మంజూరు చేసిందన్నారు. దీనికి ఒక ఉపాధ్యాయుడ్ని కేటాయించినట్టు చెప్పారు. గతంలో ఇక్కడ ఎయిడెడ్ పాఠశాల ఉండేదన్నారు. పాఠశాలను ఎమ్మెల్యే రెడ్డి శాంతి చేతుల మీదుగా ప్రారంభిస్తామన్నారు. వైస్ ఎంపీపీ సవిరిగాన ప్రదీప్ మాట్లాడుతూ.. రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకొని గ్రామాల్లో మంచినీటి సమస్య తలెత్తకుండా ముందుగానే చర్యలు తీసుకోవాలన్నారు. పాతపట్నంలో నీలమణిదుర్గ అమ్మవారి గ్రామ పండుగలు నిర్వహించనున్న నేపథ్యంలో మంచినీరు, విద్యుత్ స్తంభాలు, లైట్లు ఏర్పాటు చేయాలని, పారిశుద్ధ్యం క్షీణించకుండా చూడాలన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ కల్యాణ్‌రామ్ మాట్లాడుతూ.. పాతపట్నంలో ఇంటింటికీ కుళాయి ప్రాజెక్టు మంజూరైందన్నారు. త్వరలో పనులు ప్రారంభిస్తామన్నారు. అలాగే మండలంలో 48 గ్రామాల్లో ఇంటింటి కుళాయి ప్రాజెక్టులు మంజూరైయ్యావని, అందులో భాగంగా ఐదు గ్రామాలకు ఇంటింటికి కుళాయిలు ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు. త్వరలో మిగిన గ్రామాల్లో ఈ ప్రక్రియ పూర్తి చేస్తామని చెప్పారు. విద్యుత్ శాఖ ఇన్‌చార్జి ఏఈ రమేష్ మాట్లాడుతూ.. పాతపట్నంలో విద్యుత్ స్తంభాల ఏర్పాటు, దీపాలను వేయనున్నట్లు చెప్పారు. డిప్యూటీ తహసీల్దార్ బి.ప్రసాద్ మాట్లాడుతూ.. వివిధ రెవెన్యూ గ్రామాల్లో భూముల రీ సర్వే చేపడుతున్నామని..దీనికి సర్పంచ్లు, ఎంపీటీసీ సహకరించి రైతులకు అవగాహన కల్పించాలన్నారు. మండల ఇంజినీర్ ప్రసాద్ మాట్లాడుతూ.. కొరసవాడ, సింగుపురం, రొంపివలస, ఆర్.ఎల్.పురం, తిడ్డిమి గ్రామాల్లో గ్రామ సచివాలయాలకు సంబంధించిన బిల్లులు మంజూరైనట్టు చెప్పారు. సంబంధిత కాంట్రాక్టర్లు పనులు ప్రారంభించాలని.. లేకపోతే ఉన్నతాధికారులకు తెలియజేసి నోటీసులు అందిస్తామన్నారు. మండల ప్రత్యేకాధికారి మంచు కరుణాకరరావు, మండల సలహాదారుడు ఎం.గణపతి, ఈవోపీఆర్డీ ప్రసాద్ పండా, సూపరింటెండెంట్ కె.అప్పలనాయుడు, ఏపీఎం మణిరత్నం, హౌసింగ్ ఏఈ భాస్కరరావు, ఉద్యానవనశాఖ అధికారి మంగమ్మ, ఏపీవో సురేష్, ఆర్‌అండ్‌బీ జేఈ గోపాలరావు, అంగన్‌వాడీ సుపర్‌వైజర్ సుమలత, వివిధ శాఖాధికారులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కన్వీనర్ల నియామకం

ఎల్.ఎన్.పేట: పాతపట్నం నియోజకవర్గంలోని అయిదు మండలాలకు వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కన్వీనర్లు, కో కన్వీనర్లను నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి శనివారం జాబితా విడుదలైంది. పాతపట్నం మండల కన్వీనర్‌గా గుడిమెట్ల శ్రీనివాసరావు, కో కన్వీనర్లుగా పెద్దింటి రాజ్‌కుమార్, పేడాడ భాస్కరరావు, మద్ది నారాయణరెడ్డి, పొట్నూరు తరుణ్‌కుమార్ నియామకమయ్యారు. మెళియాపుట్టి మండల కన్వీనర్‌గా అడ్డి రాజేష్, కోకన్వీనర్లుగా బమ్మిడి గణపతి, గూడ జీవనరావు, గులుమూరు లక్ష్మీనారాయణ, పోలాకి మోహన్‌రంగా, ఎల్.ఎన్.పేట కన్వీనర్‌గా చింతాడ రామశంకర్, కో కన్వీనర్లుగా గొద్దు శంకరరావు, కేసారపు తవిటిరాజు, భవిరి మల్లికార్జునరావు, శివ్వాల కుమారి, కొత్తూరు కన్వీనర్‌గా గేదెల చిన్నబాబు, కోకన్వీనర్లుగా పతివాడ సుదర్శనరావు, విసాక సూరిబాబు, యజ్జల వినోద్‌కుమార్, హిరమండలం కన్వీనర్‌గా పొట్నూరు సింహాచలం, కోకన్వీనర్లుగా మడపాటి తేజేశ్వరరావు, ఎద్దశెట్టి తిరుపతిరావు, శాంతా పాణిగ్రాహి నియమితులయ్యారు.

ఆమదాలవలస నియోజకవర్గం..

ఆమదాలవలస: ఆమదాలవలస టౌన్ కన్వీనర్‌గా ఆవాల శంకర్, కోకన్వీనర్లుగా జామి భాస్కర్, చింతాడ రాము, సనపల శ్రీధర్, రావలవలస సూర్యారావు నియమితులయ్యారు. ఆమదాలవలస మండల కన్వీనర్‌గా బమ్మిడి అచ్యుతరావు, కోకన్వీనర్లుగా లంక పవన్ కల్యాణ్, మండల రాజశేఖర్, ఇలపండ సాయికృష్ణ, సిర్రా యుగంధర్, సరుబుజ్జిలి కన్వీనర్‌గా గదిల రమణ, కో కన్వీనర్లుగా వెలమల ప్రసాద్‌రావు, సబ్బ రమేష్, కొల్లా వెంకట కృష్ణారావు, గదిలి మహేష్, పొందూరు కన్వీనర్‌గా కంటా గోవిందరావు, కో కన్వీనర్‌లుగా పట్నాన సాయికుమార్, కొవెల నాగరాజు, చింతా రమణ, పల్లా అచ్యుతరావు, బూర్జ కన్వీనర్‌గా ఆబోతుల శంకర్, కో కన్వీనర్లుగా దిబ్బ హరి, గుదిశ నరేష్, సీర హరి, బలి ప్రవీన్ కుమార్.

నరసన్నపేట నియోజకవర్గం..

నరసన్నపేట: నరసన్నపేట మండల కన్వీనర్‌గా కుప్పిలి రామకుమార్, కో కన్వీనర్లుగా లాస రాజకుమార్, టేకి రవిరాజ్, దేశిల్ల శ్రీనివాసరావు, ముద్దాడ శ్రీనివాస గాంధీ నియమితులయ్యారు. పోలాకి కన్వీనర్‌గా చింతాడ సోమేశ్వరరావు, కో కన్వీనర్లుగా సానాల రాంజీ,, ధర్మాన బుజ్జినాయుడు, డోల సాయి, పాసిన రమణ యాదవ్, చిగురుపల్లి సత్యాన్నారాయణ, సారవకోట కన్వీనర్‌గా రాడ తిరుపతిరావు, కోకన్వీనర్లుగా చల్ల నరేష్, దుంగ గోపి, యడ్ల సంతోష్‌కుమార్, జలుమూరు కన్వీనర్‌గా కరణం గణపతిరావు, కో కన్వీనర్లుగా రేగాన హరేరామ్, వాన చంద్రమౌళి, కర్రి అప్పయ్య యాదవ్, దువ్వారపు రామకృష్ణ, చల్ల వెంకటరమణ నియమితులయ్యారు.

నీలమణిదుర్గ అమ్మవారి పండుగపై సమావేశం


సమావేశమైన గ్రామ పెద్దలు

పాతపట్నం: పాతపట్నం నీలమణిదుర్గ అమ్మవారి పెద్ద పండుగ చేయడానికి గ్రామ పెద్దలు నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు శనివారం సాయంత్రం జగన్నాథ ఆలయం (మఠం)లో సమావేశం నిర్వహించారు. మే చివరి వారం లేదా జూన్ మొదటి వారంలో పండుగను చేయడానికి నిర్ణయించారు. అయితే తేదీని ప్రస్తుతానికి ఖరారు చేయలేదు. ఉగాది రోజున మరోసారి సమావేశమై తేదీని ఖరారు చేయనున్నారు. ఏడు సంవత్సరాలకు ఒకసారి ఘనంగా నిర్వహించాల్సిన పండుగను కరోనా కారణంతో జరపలేదు.


15న ఉర్లాంలో మెగా వైద్య శిబిరం

నరసన్నపేట: ఉర్లాం గ్రామంలో ఈ నెల 15వ తేదీన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు సర్పంచ్ పోలాకి నర్సింహమూర్తి తెలిపారు. కిమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించే శిబిరంలో వైద్యులు రోగులను పరీక్షించి అవసరమైన వారికి మందులు అందజేస్తారన్నారు. శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ ప్రారంభిస్తారన్నారు.

బోరుభద్రలో ప్రత్యేక పూజలు

పాతపట్నం: బోరుభద్ర గ్రామంలో అభయాంజనేయస్వామి ఆలయ విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో భాగంగా రెండో రోజైన శనివారం మండపరాధనతో పాటు ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. సర్పంచ్ సవిరిగాన శ్రీదేవి, పెద్దలోగిడి, చిన్నలోగిడి, సీతారాంపల్లి, బూరగాం గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి రూ. లక్ష విరాళం


గామ పెద్దలకు విరాళాన్ని అందజేస్తున్న విశ్వనాథ్ బరోడా

పాతపట్నం: బూరగాం గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న జడ్డమ్మ ఆలయానికి పాతపట్నం పట్టణానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు విశ్వనాథ్ బరోడా లక్ష రూపాయలను విరాళంగా ప్రకటించారు. ఈ మొత్తాన్ని గ్రామ పెద్దలు ప్రహల్లాద పుల్లాయ్, విజయ బరోడాలకు శనివారం అందజేశారు. ఈ సందర్భంగా పెద్దలు మాట్లాడుతూ.. ఆలయ నిర్మాణానికి అందరూ సహకరించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బిజిలి పుల్లాయ్, రాబి పోల్లాయ్ పాల్గొన్నారు.

ఉత్సవానికి వేళాయె..

● నేటి నుంచి సంతోషిమాత, ఉమా రామలింగేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవం


ఉమారామలింగేశ్వర స్వామి ఆలయం

ఎల్.ఎన్.పేట: మోదుగువలస (చిన్నకొల్లివలస ఆర్ ఆర్ కాలనీ)లోని సంతోషిమాత, ఉమా రామలింగేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవాన్ని ఈ నెల 12 నుంచి 18వ తేదీ వరకు నిర్వహించనున్నట్టు గ్రామ సర్పంచ్ రెడ్డి రామారావు తెలిపారు. దీనికి కోసం గ్రామ పురోహితులు భాస్కరభట్ల వరప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో తొలిరోజు ఉదయం 9.30 గంటలకు ప్రత్యేక పూజలతో పూజలతో కార్యక్రమాలు ప్రారంభమవుతాయన్నారు.13న ఉమా రామలింగేశ్వర స్వామి ఆలయంలో పూజలు, 14, 15 తేదీల్లో హోమం, అభిషేకం, రుద్రాభిషేకం, అన్నసంతర్పణ, 16, 17 తేదీల్లో కుంకుమ పూజలు, 18న మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా రుద్రాభిషేకాలు, లింగోద్భవం ఉంటుందన్నారు. ఉత్సవాల్లో భాగంగా రోజూ సాంస్కృతిక, డాన్స్ పోటీలు, ప్రదర్శనలు ఉంటాయని కమిటీ సభ్యులు చెప్పారు.

లోక్ అదాలత్‌లో 248 కేసుల పరిష్కారం


నరసన్నపేట: లోక్‌అదాలత్ నిర్వహిస్తున్న జూనియర్ సివిల్ జడ్జి హరిప్రియ

పాతపట్నం: పాతపట్నంలోని కోర్టు ప్రాంగణంలో శనివారం ఆన్‌లైన్‌లో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 248 కేసులను పరిష్కరించినట్లు కోర్టు ఇన్‌చార్జి జూనియర్ సివిల్‌జడ్జి ఎం.ఎస్.హెచ్.ఆర్.టి చక్రవర్తి తెలిపారు. కోర్టు పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్, రాజీ పడదగిన క్రిమినల్, ఎంసీ కేసు, పార్టీ షూట్ కేసు, కక్షిదారుల నుంచి అపరాధ రుసుంగా రూ. 4.30 లక్షలు వసూలు అయిందన్నారు. కార్యక్రమంలో పోలీసులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

నరసన్నపేట కోర్టులో..

నరసన్నపేట: స్థానిక కోర్టు పరిధిలో 574 కేసులు పరిష్కారమయ్యాయి. జూనియర్ సివిల్ జడ్జి సి.హరిప్రియ ఆధ్వర్యంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. దీంట్లో 500 పెట్టీ, 23 బ్యాంకు, మూడు సివిల్, 27 జరిమానా కేసులతోపాటు రాజీ కేసులు 21 పరిష్కారమయ్యాయి.

వన్‌వే ట్రాఫిక్ నిబంధనల అమలు


సిబ్బందికి సూచనలిస్తున్న ఎస్‌ఐ మధుసూదనరావు

గార: వత్సవలస రాజమ్మ తల్లి జాతరకు శనివారం అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. రెండో వారం జాతరకు సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అక్కడే రాత్రి బస చేశారు. ఆదివారం ఉదయం సముద్రస్నానాలాచరించి అమ్మవారిని దర్శించుకుంటారు. శ్రీకూర్మం జంక్షన్, తూలుగు మీదుగా వత్సవలస వరకు వన్‌వే ట్రాఫిక్ నిబంధనలు అమలు చేశారు. తిరుగు ప్రయాణంలో శ్రీకూర్మం మీదుగా శ్రీకాకుళం వైపు వాహనాలు వెళ్లాలని పోలీసులు సూచించారు. గార ఎస్‌ఐ ఎం.మధుసూదనరావు పోలీసులకు తగు సూచనలిచ్చారు.

అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్


నరసన్నపేట: నోటిఫికేషన్ కాపీలను సూపర్‌వైజర్లకు అందజేస్తున్న పీవో నాగమణి

నరసన్నపేట: నరసన్నపేట ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, మినీ అంగన్‌వాడీ కార్యకర్తల పోస్టుల భర్తీకి శనివారం నోటిఫికేషన్ జారీ చేసినట్టు పీవో నాగమణి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రోస్టర్ రిజర్వేషన్ల కారణంగా ఆయా పరిధిలో ఆయా రిజర్వేషన్లకు చెందిన దరఖాస్తుదారులు లేకపోవడంతో ఏళ్ల తరబడి ఖాళీలు భర్తీ కాలేదన్నారు. ఐదు మెయిన్ కేంద్రాల కార్యకర్తలతో పాటు మొత్తం 19 పోస్టులు భర్తీకి చర్యలు తీసుకుంటున్నామన్నారు. నోటిఫికేషన్ ప్రాప్తికే అర్హత ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

మెళియాపుట్టి: చొంపాపురం, జాడుపల్లి, చాపర గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలకు సంబంధించి హెల్పర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సారవకోట సీడీపీవో హెచ్.కె.కామాక్షి తెలిపారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 18వ తేదీలోగా సారవకోట ఐసీడీఎస్ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలన్నారు.

హెల్పర్ పోస్టులకు..

బూర్జ: స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని మూడు అంగన్‌వాడీ కేంద్రాలలో హెల్పర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సీడీపీఓ ఎస్.గీత తెల్పారు. బూర్జ-1, కొళపర్తి, నీలదేవిపురం-3 కేంద్రాల్లో సహాయకుల ఉద్యోగానికి సంబంధించి ఓసీ కేటగిరీకి చెందిన 21 నుంచి 35 ఏళ్లలోపు మహిళలు 18వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

రబీ వరికి ఈక్రాప్ నమోదు


వరికి ఈక్రాప్ నమోదు చేస్తున్న వ్యవసాయ సిబ్బంది

నరసన్నపేట: మండలంలో రికార్డు స్థాయిలో రబీ వరిని రైతులు సాగు చేస్తున్నారు. 674 హెక్టార్లలో ఇప్పటికే నాట్లు పడగా.. గొట్టిపల్లి, కరగాం, రెడ్డికిపేట, మాకివలస తదితర గ్రామాల్లో రైతులు నాట్లు వేస్తున్నారు. దీంతో 700 హెక్టార్లకు పైబడి విస్తీర్ణం ఉండవచ్చని వ్యవసాయాధికారిని కె.సునీత తెలిపారు. చిక్కాలవలస వద్ద రైతులు సాగు చేసిన రబీ వరికి ఈక్రాప్ నమోదును శనివారం వ్యవసాయ సిబ్బంది చేపట్టగా.. ఈ ప్రక్రియను ఆమె పరిశీలించారు. గత రెండేళ్లతో పోల్చితే రబీలో వరి విస్తీర్ణం బాగా పెరిగిందన్నారు. చెరువుల్లో సమృద్ధిగా నీరు ఉండటం, వంశధార కాలువల్లో నీరు వస్తుండటంతో రైతులు అధికంగా వరి వేస్తున్నారన్నారు.

పౌష్టికాహారంతో రక్తహీనత దూరం


గర్భిణులకు వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

హిరమండలం: పౌష్టికాహారం తీసుకుంటే రక్తహీనత నుంచి బయట పడగలమని హిరమండలం పీహెచ్‌సీ వైద్యాధికారి సాయిగీత అన్నారు. ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ పథకంలో భాగంగా పీహెచ్‌సీలో శనివారం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వైద్యాధికారులు సాయిగీత, ఫరూక్ హూస్సేన్లు 79 మంది గర్భిణులకు వైద్య తనిఖీలు చేపట్టారు. వీరిలో పలు హైరిస్కు కేసులను గుర్తించామని వైద్యులు తెలిపారు. జెమ్స్ ఆస్పత్రి సహకారంతో అల్ట్రాసౌండ్ స్కాన్లు చేశామన్నారు. ఆహారపు అలవాట్లు, జాగ్రత్తలను గర్భిణులకు వివరించారు. అవసరమైన వారికి మందులను పంపిణీ చేశారు. అనంతరం గర్భిణులకు సత్యసాయి భక్తుల ఆధ్వర్యంలో భోజనం అందజేశారు. కార్యక్రమంలో జెమ్స్ వైద్యులు సుధీర్, అభిషేక్ స్వప్న, ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు ఉన్నారు.

స్వయం ఉపాధి యూనిట్ పరిశీలన

కొత్తూరు: మెట్టూరు బిట్-3 గ్రామ పంచాయతీలో ఏర్పాటు చేసిన స్వయం ఉపాధి యూనిట్‌ను నాబార్డు ఏజీఎం వరప్రసాదరావు శనివారం పరిశీలించారు. మినుములు, పెసలు నుంచి తొక్కతీసే యూనిట్‌తో పాటు ధాన్యం మిల్లింగ్ యూనిట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఇరపాడుకు చెందిన 60 మంది మహిళలు జనపనారతో వస్తువుల తయారీపై నాబార్డు సౌజన్యంతో ఇటీవల శిక్షణ ఇచ్చారు. శిక్షణ పొందిన వారు స్వయం ఉపాధి పొందేందుకు వీలుగా వస్తువుల తయారీ కోసం షెడ్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని సర్పంచ్ శ్రీనివాసరావు ఏజీఎంను కోరారు. అంతకముందు గ్రామంలోని రామాలయాన్ని సందర్శించారు.

గుర్రపుడెక్క తొలగించాలి


తురకపేట సమీపంలో కాలువలో పేరుకుపోయిన గుర్రపుడెక్క

సరుబుజ్జిలి: యరగాం-పురుషోత్తపురం ఓపెన్‌హెడ్ చానల్ పరిధిలోని కాలువలో గుర్రపుడెక్క పేరుకు పోయింది. కాలువ పరిధిలో ఖరీఫ్, రబీ సీజన్లలో సుమారు ఎనిమిది వేల ఎకరాలకు సాగునీరు అందించేలా చానల్‌ను నిర్మించారు. అయితే కాలువనిండా గుర్రపు డెక్క, మట్టి దిమ్మలు భారీగా పేరుకుపోవడంతో శివారు భూములకు సక్రమంగా సాగునీరు అందని పరిస్థితి నెలకొంది. అధికారులు గుర్రపు డెక్క తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

సాటిలేని గాయకుడు ఘంటసాల


మాట్లాడుతున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు


పాటలు పాడుతున్న కళాకారులు

శ్రీకాకుళం కల్చరల్: ఎన్నటికీ సాటిలేని గాయకుడిగా ఘంటసాల వెంకటేశ్వరరావు నిలుస్తారని రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. నగరంలోని బాపూజీ కళామందిర్‌లో శనివారం ఘంటసాల వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఘంటసాలను స్మరించుకునే అదృష్టం ఈ వేదిక ద్వారా లభించిందన్నారు. ఆయన స్వరం అజరామరమని పేర్కొన్నారు. ఆయన పేరిట నేటి వర్ధమాన గాయకుల కోసం వేదికను ఏర్పాటు చేస్తున్న నిర్వాహకులు అప్పన్న గొప్ప వ్యక్తి అని ప్రశంసించారు. ముందుగా మెహెర్ ప్రభాకర్ సారథ్యంలో భరత నాట్య ప్రదర్శన చక్కగా సాగింది. అనంతరం ఘంటసాల స్వరమాధురి కార్యక్రమంలో భాగంగా డాక్టర్ నిక్కు అప్పన్న, కల్యాణం రామ్మోహన్‌రావు, కె.ఎల్.ఎన్.మూర్తి, డాక్టర్ ఇ.ఎస్.సంపత్‌కుమార్ తదితరులు చక్కని గీతాలను వీనుల విందుగా వినిపించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ ఎం.వి.పద్మావతి, కళాప్రవీణ బండారు చిట్టిబాబు, వరం చారిటబుల్ ట్రస్టు ప్రతినిధి ఎ.వి.ఎస్.ప్రసాద్, డాక్టర్ పులఖండం శ్రీనివాసరావు, వావిలపల్లి జగన్నాథరావు, సురంగి మోహనరావు, జామి భీమశంకర్, అంబటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.